# అమెరికా దొరసాని

**–చాగంటి నాగరాజారావు**

''రామయ్యగారమ్మాయి రాధిక రేపు పదో తారీకున అమెరికా నుంచి వస్తోందట'' అంది విశాలాక్షి. ఆమె మాటల్లో కాస్త ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ కన్పించింది.

ఆశ్చర్యంగా తలెత్తి చూసింది ఆమె కూతురు సుశీల.

ఆ ఊళ్లో సుబ్బన్న మకుటం లేని మహారాజు. అంతా ఆయనకు నమస్కరించే వాళ్లే. ఆయన తరువాతే రామయ్య. సుబ్బన్న కుటుంబం ఇన్నేళ్ళుగా రామయ్య కుటుంబం కంటె ఒక మెట్టు హోదాలోనే ఉంది. ప్రస్తుతం రామయ్య కూతురు, అల్లుడు అమెరికా నుంచి రాగానే తాను ఒక మెట్టు తగ్గిపోక తప్పదు.

తల్లీ కూతుళ్లకి మనసులో ఆందోళన బయల్దేరింది. సుబ్బన్న ఇంటికి రాగానే తల్లీ కూతుళ్లిద్దరూ విషయం వివరించారు.

''అవునే విశాలాక్షీ నువ్వు చెప్పింది నిజం. రాధిక చిన్నప్పట్నుంచీ కొంచెం ఫ్యాషన్‌గా ఉండేది. ఇప్పుడు అమెరికాలో పదేళ్లుండి వస్తోందంటే మనల్నసలు లక్ష్య పెట్టదు. అందుకే నువ్వు, అమ్మాయి కూడా అమెరికా వాళ్లలా మంచి బట్టలు వేసుకుని కాస్త హుందాగా, ఫ్యాషన్‌గా కన్పించాలి'' అన్నాడు సుబ్బన్న.

ఆ రోజు నుంచీ సుబ్బన్న ఇంట్లో ఎన్నో మార్పులొచ్చాయి. ఇంట్లో వస్తువులతోబాటు వేషభాషలు కూడా క్రమంగా మారాయి.

ఒకరోజు సుబ్బన్న భార్యని, కూతుర్ని పిలిచి ''రేపు నేను బొంబాయి వెళ్తున్నాను. మీ ఇద్దరి కొలతలు ఇవ్వండి. మంచి బట్టలు తెస్తాను.'' అన్నాడు సుబ్బన్న.

వారం రోజులు గడిచాయి. సుబ్బన్న బొంబాయి నుంచి తిరిగి వచ్చాడు. ఆత్రంగా ఆయన బ్యాగ్ తెరిచి చూశారు విశాలాక్షీ, సుశీల. ఆయన తెచ్చిన గౌన్లు లేటెస్ట్ ఫ్యాషన్స్‌లా కనిపించాయి. మొదట్లో ఆ గౌన్లు వేసుకోడానికి సందేహించింది విశాలాక్షి. కాని వేసుకోక తప్పదు. లేకపోతే రాధిక ముందు తలవంచుకుని నిలబడాల్సి వస్తుంది.

గౌను వేసుకుని, కూలింగ్ గ్లాసులు పెట్టుకుని భర్త ముందు నుంచుంది విశాలాక్షి. 'ఫాన్ టాస్టిక్' అనుకున్నాడు సుబ్బన్న. ఆమెనలా చూస్తుంటే బొంబాయిలో తాను చూసిన అమెరికా దొరసానిలా కనిపించింది విశాలాక్షి.

''అంతా బాగానే వుంది. మెడలో ఆ తాళిబొట్టు తీసెయ్. కాళ్లకి హై హీల్స్ వేసుకో. అమెరికాలో ఎవరికీ తాళి బొట్లుండవు'' అన్నాడు సుబ్బన్న.

''ఏమండీ! తాళిబొట్టు తియ్యడం అశుభమేమోనండీ! పోనీ, గౌను క్రింద కనబడకుండా పెట్టుకుంటాను'' వినయంగా అంది విశాలాక్షి.

''అంటే భారతీయ పల్లెటూరి గంగిరెద్దులా రాధిక ముందు ప్రత్యక్షమౌతానంటావు. ఛీ, దరిద్రగొట్టు మొహమా, చెప్పినట్టు విను'' ఆవేశంతో అరిచాడు సుబ్బన్న.

''సరేనండీ. మీరు చెప్పినట్లే వింటాను'' అని తాళి బొట్టు తీసి అల్మరాలో దాచింది విశాలాక్షి. భారతీయ సంప్రదాయం కాని, సంస్కృతి కాని ఏమాత్రం తన వేష, భాషల్లో ప్రతిబింబించకుండా ఉండేలా జాగ్రత్త పడింది విశాలాక్షి. ఆమె కూతురు సుశీల కూడా తల్లిని అనుసరించింది.

సాయంత్రం ఐదు గంటలయ్యింది.

సంగీతం మాస్టారొచ్చారు.

''అమ్మా! సుశీలా!'' పిల్చారు మాస్టారు.

లోపల్నుంచి సుబ్బన్న జీన్స్ ప్యాంటు, టీ షర్టు వేసుకుని కూలింగ్ గ్లాసులు సవరించుకుంటూ వచ్చాడు.

''హలో!'' అన్నాడు సుబ్బన్న

ఆశ్చర్యంగా చూశాడు సంగీతం మాస్టారు.

''మై డాటర్? నో, మార్కెట్ గోయింగ్'' వచ్చీరాని ఇంగ్లీషులో అన్నాడు సుబ్బన్న.

''ఇంట్లో ఆ గోలేమిటండీ?'' అన్నాడు మాస్టారు.

''డోన్ట్ టాక్. ఇంగ్లీషు సంగీతం గోలలాగా ఉందటయ్యా నీకు? నీ చెత్త సంగీతం కంటె అది చాలా గొప్పది'' కోపంగా అన్నాడు సుబ్బన్న.

ఆ సంగీతం వింటుంటే పదిమంది మనుషులు గోల చేస్తూ ఆయన తలమీద సుత్తులతో కొడుతున్నట్లనిపించింది మాస్టారికి.

''మహాప్రభో! ఏమిటీ విపరీతం? చక్కగా శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకుంటున్న అమ్మాయికి సంగీతం మానిపించి ఈ గోలకి అలవాటు చేస్తున్నారా?'' బాధగా నిట్టూర్చాడు సంగీతం మాస్టారు.

''చెప్పావు లేవయ్యా. ఒక నెల జీతం అదనంగా ఇస్తాను. ఇక దయచెయ్'' అని ఆయన్ని పంపేశాడు సుబ్బన్న.


సుబ్బన్న ఇంట్లో రోజురోజుకీ మార్పులు కనిపిస్తూనే ఉన్నాయి. ఇంట్లో ఉన్న ఫర్నీచర్ అంతా మారిపోయింది. తినే ఊరగాయలు కూడా పనిమనిషి కిచ్చేశారు. ఆ ఆవకాయ, గోంగూర లాంటి పచ్చళ్లు తింటే వాటిని పల్లెటూరి తిళ్లని రాధిక అసహ్యించుకుంటుందని వాటి స్థానంలో బిస్కట్లు, కేక్‌లు, కోడిగుడ్లు పెట్టారు. ఇంచుమించు అన్నం తినడం కూడా తగ్గించేసి బ్రెడ్, జామ్‌తోటే కాలం గడపడం మొదలెట్టారు.

''ఏమిటమ్మా ఆ పుస్తకాలు?'' షెల్ఫ్‌లోని పుస్తకాల వైపు చూసి అన్నాడు సుబ్బన్న.

''మహాభారతం, రామాయణం నాన్నా'' అంది సుశీల.

''ఛీ ఛీ, ఆ పుస్తకాల్ని తూకానికమ్మెయ్, బజార్లో ఏమైనా మంచి అందంగా కనిపించే ఇంగ్లీషు పుస్తకాలు తీసుకురా. లేకపోతే రాధిక మనల్ని ఇంగ్లీషు తెలియని వాళ్లని చులకన చేస్తుంది. చూడు! నన్ను నాన్నా అని పిలవద్దని ఎన్నిసార్లు చెప్పాను!'' ఆజ్ఞాపించాడు సుబ్బన్న.

**''చూడు విశాలాక్షీ! రామయ్య గారమ్మాయి రాధిక ఈ ఉదయమే వచ్చిందట. మనం వాళ్లింటికి వెళ్లద్దు. తానే వస్తే వస్తుంది. తాను మనింటికి వచ్చినప్పుడు మాత్రం మీరు అచ్చం అమెరికన్స్‌లా ప్రవర్తించాలి. తెల్సిందా?'' హెచ్చరించాడు సుబ్బన్న.**



''ఓ కే డాడీ, '' అంది సుశీల.

ఆ మాటలకి మనసు తేలికై ఆనందంతో నవ్వాడు సుబ్బన్న.

రోజులు గడుస్తున్నాయి.

రాధిక అమెరికా నుంచి వచ్చే రోజు దగ్గరపడు తోంది. రోజులు గడుస్తున్న కొద్దీ సుబ్బన్నగారింట్లో తెలుగుతనం, తెలుగుభాష, తెలుగు వాతావరణం దూరమై వాటి స్థానంలో విదేశీ సంస్కృతి చోటు చేసు కుంటోంది. తన భార్య, కూతురి వేష భాషలు చూసి రాధిక ఆశ్చర్యంలో మునిగిపోక తప్పదని గర్వపడ సాగాడు సుబ్బన్న.

అనుకున్న రోజుకు రాధిక తన భర్త, ఇద్దరు పిల్లలతో ఇండియాకు వచ్చింది.

''చూడు విశాలాక్షీ! రామయ్య గారమ్మాయి రాధిక ఈ ఉదయమే వచ్చిందట. మనం వాళ్లింటికి వెళ్లద్దు. తానే వస్తే వస్తుంది. తాను మనింటికి వచ్చినప్పుడు మాత్రం మీరు అచ్చం అమెరికన్స్‌లా ప్రవర్తించాలి. తెల్సిందా?'' హెచ్చరించాడు సుబ్బన్న.

''అలాగేనండీ'' యధాలాపంగా అంది విశాలాక్షి.

ఇంతలో సుబ్బన్న బుర్రలో ఒక గొప్ప ఆలోచన మెరుపులా తట్టింది. అలాంటి ఆలోచన తట్టినందుకు 'అదృష్టవంతుణ్ణి. లేకపోతే నా కొంప మునిగేది' అనుకుని తనని తానే అభినందించుకున్నాడు సుబ్బన్న. వెంటనే భార్యతో అన్నాడు.

''చూడు! నేను నిన్ను స్వీటీ అనీ, అమ్మాయిని డాలీ అని పిలుస్తాను. నువ్వు నన్ను 'హాయ్! హబ్బీ' అని పిలవాలి. తెల్సిందా! ఒకవేళ రాధిక మీతో గర్వంగా ప్రవర్తిస్తే మీరిద్దరూ అంతకంటే గర్వంగా కన్పించాలి. తెల్సిందా?''

రాధిక వచ్చి నాలుగు రోజులు గడిచాయి.

''చూశావుటే, రాధిక వచ్చి నాలుగు రోజులైనా మనింటికి రాలేదు? ఎంత అహంకారమో? ఊరంతా ఆమెను చూడ్డానికి ఆమె ఇంటికి విరగబడి పోతున్నారు. మనం మాత్రం వెళ్లద్దు.'' అహంకారంతో అన్నాడు సుబ్బన్న.

అదే రోజు సాయంత్రం-

కాలింగ్ బెల్ మ్రోగింది. విశాలాక్షి వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా నమ్మశక్యం కాని దృశ్యాన్ని చూసింది.

మామిడి పిందెల జరీ పువ్వులున్న మందారం రంగు పట్టుచీరని సంప్రదాయ పద్ధతిలో కట్టుకుని, పచ్చటి ఛాయతో, మెడలో నల్లపూసల తాడుకి మంగళసూత్రాలు వ్రేలాడుతూ, ఉదయిస్తున్న సూర్యుడిలా నుదుట ఎర్రగా మెరుస్తూన్న బొట్టు, కాళ్లకి మట్టెలు, రెండు చేతులకూ గాజులతో అచ్చం తెలుగింటి ఆడబడుచులా ఉంది రాధిక.

''బావున్నారా అత్తయ్యా? రేపు శ్రావణ శుక్రవారం నోము నోచుకుంటున్నానత్తయ్యా! నువ్వూ, సుశీలా పేరంటానికి తప్పకుండా రావాలి'' విశాలాక్షి నుదుట బొట్టు పెడుతూ అంది రాధిక

దేశాన్ని వదిలినా సంప్రదాయాల్ని వదలని రాధికని చూస్తూ మౌనంగా ఉండిపోయింది విశాలాక్షి!

★